చొప్పరిపల్లిలో రూ. 52 వేలు స్వాధీనం

కాసిపేట, మార్చి 29 : కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్‌చెక్ పోస్ట్ వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. బెల్లంపల్లికి చెందిన రాంభట్ల వేణుగోపాల్ శర్మ రూ.52,400 తరలిస్తుండగా స్వాధీనం చేసు కొని సీజ్ చేశారు. అనంతరం ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ వివరించారు.

నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మందమర్రిలో వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ఏడు మున్సిపాలిటీలు.. రూ.237.88 కోట్లు

పట్టణాలకు తాగు నీరందించడమే లక్ష్యంగా అమృత్ పథకం కింద మంజూరైన నిధులివీ..

- 2048 సంవత్సరం దాకా సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు
- 'మిషన్ భగీరథ'కు కొనసాగింపుగానే పనులు
- నీటి వృథాను తగ్గించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్
- ఎక్కడికి ఎంతెంత వెళ్లాలో అంతే..
- త్వరలో పనులు ప్రారంభించే అవకాశం

మంచిర్యాలలోని వాటర్‌ట్యాంకు

మంచిర్యాల, మార్చి 29 : పట్టణ ప్రజలకు తాగు నీరందించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం అమృత్ (అటల్ మిషన్ ఫర్ రెజ్యువనేషన్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్) పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు రూ. 237.88 కోట్లు ఇవ్వగా, ఆ మేరకు పట్టణాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సైతం యంత్రాంగం సిద్ధం చేసింది. 2048 సంవత్సరం దాకా సరిపడా తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిధులతో పనులు చేపట్టనున్నది. ఇప్పటికే పట్టణాల్లో మిషన్ భగీరథ పనులు పూర్తయి ఉండగా, వాటికి కొనసాగింపుగా ఈ పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నది. అవసరమైన పైపులైన్ల విస్తరణ, నీటి ట్యాంకులు, సంపులు, నీటిశుద్ధి కేంద్రాలు, ట్యాంకులకు ప్రహరీలు, సిబ్బంది క్వార్టర్లవంటి నిర్మాణాలు చేపట్టనున్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీలు, ప్రాంతాల్లో కొత్త పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. కాగా, ఈ పథకంలో భాగం గా నీటి వినియోగపు వివరాల లెక్కలను పక్కాగా నమోదు చేయనున్నారు. స్కాడా సాఫ్ట్‌వేర్ ద్వారా నీటి ట్యాంకులకు వస్తున్న నీరు ఎంత, అక్కడి నుంచి ఏ ప్రాంతానికి ఎంతెంత నీరు వెళ్తున్నదో నమోదు చేస్తారు. ప్రతీ ట్యాంకు దగ్గర ఫ్లో మీటర్లు ఏర్పాటు చేస్తారు. సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తమైన వివరాల ప్రకారం ఒక ప్రాంతానికి నీరు సరఫరా చేసే క్రమంలో ఆ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో అంతేనీటిని ఆటోమేటిక్‌గా సరఫరా చేస్తారు. దీంతో నీటి వృథా తగ్గుతుంది. భవిష్యత్‌తో తాగునీటి నల్లాలకు మీటర్లు ఏర్పాటు చేసే అవకాశం కూడా లేకపోలేదు. వాడుకున్న నీటికి బిల్లు చెల్లించే విధంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

మంచిర్యాల మున్సిపాలిటీ : అమృత్ నిధులతో సాయికుంటలో 600 కేఎల్ సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు, 21 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, 2.73 కిలో మీటర్ల మేర పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్ల ఏర్పాటు, కొత్తగా 6,,172 నల్లా కనెక్షన్‌లు ఇవ్వడంవంటి పనులు చేపట్టనున్నారు.

నస్పూర్ మున్సిపాలిటీ : 5.3 కిలోమీటర్ల మేర పంపింగ్ మెయిన్ లైన్లు, 8.3 కిలో మీటర్ల మేర ఫీడర్ మెయిన్ లైన్లు, 18 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ లైన్లు విస్తరించనున్నారు. వెయ్యి కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకులు రెండు, 1800 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకు ఒకటి, 1500 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకులు రెండు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించనున్నారు. ఇక్కడ నీటి సరఫరాను ఏడు జోన్లుగా విభజించి చేపట్టనున్నారు. కొత్తగా 5,,040 నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు.

లక్షెట్టిపేట మున్సిపాలిటీ : 5.5 కిలోమీటర్ల మేర పంపింగ్ మెయిన్, 1.85 కిలోమీట్లర్ల ఫీడర్ మెయిన్, 11 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ లైన్‌లను విస్తరించనున్నారు. కొత్తగా 1200 కేఎల్, 600 కేఎల్ సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకులను నిర్మించనున్నారు. కొత్తగా 1,273 నల్లా కనెక్షన్లను ఇవ్వనున్నారు.

చెన్నూరు మున్సిపాలిటీ : 6.7 కిలోమీటర్ల ఫీడర్ మెయిన్, 45 కిలో మీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ లైన్లు విస్తరించనున్నారు. ఇక్కడ 1400 కేఎల్ ట్యాంకు ఒకటి, 700 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకు ఒకటి, 600 కేఎల్ సామర్థం కలిగిన ట్యాంకు ఒకటి కలిపి మొత్తం మూడు ట్యాంకులు నిర్మించనున్నారు. కొత్తగా 2,000 నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు.

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ : 1.11కిలోమీటర్ల ఫీడర్‌మెయిన్, 150 మీటర్ల పంపింగ్ మెయిన్, 55కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మించనున్నారు. 1200 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకు ఒకటి, 1000 కేఎల్ సామర్థ్యం కలిగిన ట్యాంకు ఒకటి, 600 కేఎల్ సామర్థ్యం కలిగిన సంప్ ఒకటి నిర్మించనున్నారు. కొత్తగా 5,130 నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు.

మందమర్రి మున్సిపాలిటీ : 12.2 కిలోమీటర్ల పంపింగ్ మెయిన్‌ను నిర్మించనున్నారు. అక్కడ కొత్తగా 1,456 నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు. పైపులైన్ల విస్తరణ, ట్యాంకుల నిర్మాణం ఇప్పటికే మిషన్ భగీరథ పథకంలో నిర్మించిన నేపథ్యంలో పాత పైపులైన్లు చెడిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటుచేస్తారు.

బెల్లంపల్లి మున్సిపాలిటీ : పాతపైపులైన్ల స్థానంలో 25 కిలోమీటర్ల మేర కొత్త వాటిని ఏర్పాటు చేయనున్నారు. 200 మీటర్ల ఫీడర్ మెయిన్, ఎనిమిది కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్‌లైన్లు నిర్మించనున్నారు. ఫిల్టర్స్‌కు మరమ్మతులు చేపడుతారు. ఇక్కడ 500 కేఎల్ సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు నిర్మిస్తారు. కొత్తగా 1,456 నల్లా కనెక్షన్‌లు ఇవ్వనున్నారు.

మున్సిపాలిటీల వారీగా మంజూరైన నిధులు

మంచిర్యాల	రూ. 48.50 కోట్లు
నస్పూర్	రూ. 54.16 కోట్లు
లక్షెట్టిపేట	రూ. 14.53 కోట్లు
చెన్నూర్	రూ. 22.64 కోట్లు
క్యాతన్‌పల్లి	రూ. 30.42 కోట్లు
మందమర్రి	రూ. 22.63 కోట్లు
బెల్లంపల్లి	రూ. 45.00 కోట్లు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

అమృత్ పథకం కింద అన్ని ప్రాంతాలకు తాగు నీరందించడమే లక్ష్యంగా త్వరలో పనులు ప్రారంభిస్తాం. నిర్మాణ సంస్థ అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయింది. వర్క్ ఆర్డరు రాగానే పనులు మొదలు పెడుతాం. ఇప్పటికే మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో పనులకు శంకుస్థాపనలు పూర్తయ్యాయి. మెసరింగ్, రికార్డింగ్, కౌంటింగ్ పద్ధతిన నీటి వినియోగపు లెక్కలు రికార్డు చేస్తాం. పట్టణాల్లో కొత్తగా విస్తరిస్తున్న కాలనీలు, ఏరియాలను కవర్ చేస్తూ పైపులైన్ల విస్తరణ ఉంటుంది.

- శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ డీఈ, మంచిర్యాల

అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఎన్నికలప్పుడు వచ్చే వలస పక్షులను నమ్మొద్దు
- గడ్డం కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదు
- ఆస్తులు కాపాడుకోవడానికి ఎన్ని పార్టీలైనా మారుతరు
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- మందమర్రిలో మాజీ విప్ బాల్క సుమన్‌తో కలిసి ఓట్లు అభ్యర్థన
- లక్షెట్టిపేటలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి విస్తృత ప్రచారం


మందమర్రిలో కొప్పుల ఈశ్వర్‌తో కలసి ప్రచారం చేస్తున్న మాజీ విప్ బాల్క సుమన్

మందమర్రి, మార్చి 29 : కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, అసత్య ప్రచారాలను కాదు అభివృద్ధిని చూసి ఆదరించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి పట్టణంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులతో కలసి విస్తృత ప్రచారం చేశారు. స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో మార్నింగ్ వాక్‌లో పలువురిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. అక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేశారు. యోగా హాలులో యోగా సభ్యులను కలిసి మద్దతు కోరారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలసి టిఫిన్ చేశారు. మార్కెట్ వ్యాపార సముదాయాలతో పాటు కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారులు, కొనుగోలుదారులను ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని పలువురు మహిళలు చెప్పుకొచ్చారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గతంలో సింగరేణిలో ఉద్యోగం చేశానని, కార్మికులతో పాటు ప్రజల కష్టాలు తెలుసని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని చెప్పారు. ఎన్నికలప్పుడు వచ్చే వలస పక్షులను నమ్మవద్దని, కాంగ్రెస్ అభ్యర్థికి ఇక్కడి సమస్యలు తెలియవని, ఏనాడైనా తెలంగాణ కోసం పోరాటం చేశాడా అని ప్రశ్నించారు. గడ్డం కుటుంబ సభ్యులు గెలవడానికి గ్రూపు రాజకీయాలు ప్రోత్సహిస్తారని, యాభై ఏళ్లుగా తాత, పెద్దనాన్న, తండ్రి వారసత్వంగా గెలిచి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కోటీశ్వరులైన నాయకులకు రిజర్వేషన్‌లు వర్తించవచ్చా అని ఆయన ప్రశ్నించారు. వాళ్లు ఆస్తుల రక్షణకు ఎన్ని పార్టీలైనా మారుతారని, గెలిచిన తర్వాత ప్రజల మధ్య ఉండరని, వ్యాపారాలు, పరిశ్రమలు చూసుకుంటూ హైదరాబాద్‌కే పరిమితమవుతారని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయగానే తనపై అసత్య ప్రచారాలకు తెరలేపారని, గతంలో కూడా ఇలాంటి చౌకబారు ప్రచారాలు చేసి భంగ పడ్డారని ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో ప్రజలు కాంగ్రెస్ వైఫల్యాలను తన దృష్టికి తీసుకు వస్తున్నారని, ఎన్నికల తర్వాత కాంగ్రెస్ హామీలపై నిలదీస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా వెలుగొందిందని, ఇప్పుడు తాగు, సాగు నీరందక ప్రజలు, రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, ఎండీ అబ్బాస్, బడికెల సంపత్, రాజశేఖర్, కొంగల తిరుపతి రెడ్డి, మద్ది శంకర్, పల్లె నర్సింగ్, బోరిగం వెంకటేశ్, బండారు సూరిబాబు, కనకం రవీందర్, బర్ల సదానందం, రాజలింగు, సోషల్ మీడియా వారియర్స్ సాగర్, బెల్లం అశోక్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

లక్షెట్టిపేట, మార్చి 29 : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్, వ్యాపార సముదాయాలు తిరుగుతూ పాత బస్టాండ్ మీదుగా ఊత్కూర్ చౌరస్తా వరకు ప్రచారం నిర్వహించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలతో పాటు రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. మళ్లీ మంచి రోజులు రావాలంటే బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కారు హామీల అమలులో విఫలమైందని, ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఇప్పటికే ఒకే ఇంట్లో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా, ఆశకు అంతు లేదన్నట్లుగా మళ్లీ ఎంపీ టికెట్‌ను కూడా తెచ్చుకున్నారని, ఇదంతా ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోళ్ల కాంతయ్య, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, ఓరుగంటి శ్రీకాంత్, సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, నాయకులు సురేశ్, తిరుపతి, మోటపల్కుల శ్రీనివాస్, సత్తయ్య, సుధాకర్, షాబొద్దీన్, వెంకట్రావు పాల్గొన్నారు.

పక్షులకు స్వర్గధామం కవ్వాల్

ప్రొఫెసర్ థామస్ తీసిన అరుదైన హాక్ ఈగల్ ఫొటో

ఆస్ట్రేలియా ప్రొఫెసర్ ప్రదీప్ నినాన్ థామస్

మంచిర్యాల, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా జన్నారంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ పక్షులకు స్వర్గధామం అని ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్ల్యాండ్ ప్రొఫెసర్ ప్రదీప్ నినాన్ థామస్ అన్నారు. మూడు రోజులుగా కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పర్యటించిన ఆయన గనిశెట్టి కుంట, బైసన్‌కుంట, గొందుగూడ వ్యూ టవర్లు, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో అరుదైన పక్షుల ఫొటోలను ఆయన సేకరించారు. హాక్ ఈగల్స్, క్రెస్టెడ్ సర్పెంట్ ఈగల్స్, లెస్సర్ ఫిషింగ్ ఈగల్స్ అలాంటి అరుదైన పక్షులతో పాటు జంతువుల ఫొటోలను తీసినట్లు తెలిపారు. ఇండియాలో ఇప్పటి వరకు దాదాపు అన్ని పులులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలను సందర్శించానని, పక్షి వీక్షకులు తప్పకుండా సందర్శించాల్సిన ప్రాంతం కవ్వాల్ టైగర్ రిజర్వ్ అని థామస్ చెప్పారు. ఈయన అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన జర్నలిజం ప్రొఫెసర్. జర్నలిజంపై దాదాపు 12 పుస్తకాలను పబ్లిష్ చేశారు. ఖాళీ సమయాల్లో ఫొటోగ్రఫీ చేయడం తనకు అలవాటని, అందులో భాగంగానే కవ్వాల్ రిజర్వ్‌ను సందర్శించానని ఆయన తెలిపారు.

అరిగెల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న బీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్,మార్చి29 : జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. దాదాపు 30 ఏళ్లుగా ఇఫ్తార్ విందు ఇస్తున్నట్లు అరిగెల తెలిపారు. హనుమాన్ దీక్షా పరులకు సైతం భిక్ష ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్, నాయకులు సాయిని రాజశేఖర్, రహెమాన్, నిజాం, ఇర్ఫాన్, నిసార్, ముషీర్, హైమద్, అమర్, భీమేశ్, ప్రసాద్‌గౌడ్, వెంకన్న, రాము గౌడ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- ఏప్రిల్ 1 నుంచి మే 15 వరకు ధాన్యం సేకరణ
- జిల్లా వ్యాప్తంగా 37 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసిన కలెక్టర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 24 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నది. అందుకనుగుణంగా 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, ఏప్రిల్ ఒకటి నుంచి మే 15వ తేదీ వరకు కొనుగోళ్లు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నది. సీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టనుండగా, ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ. 2080, బీ-గ్రేడ్ రకానికి రూ. 2060 మద్దతు ధర ప్రకటించింది. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్ దోత్రే యాసంగి ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయశాఖ, మార్కెటింగ్, రవాణాశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ తదితర వసతులు కల్పించాలని సూచించారు.

రైతులకు అవగాహన

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ధాన్యంలో తాలు లేకుండా చూసుకోవడంతోపాటు 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలక్ట్రానిక్ కాంటాలను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన గోనె సంచులు సిద్ధం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచనున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు చెల్లించేలా చర్యలు చేపడుతున్నారు.

మరో వారంలో కోతలు షురూ..

జిల్లాలో యాసంగి వరి కోతలు మరో వారంలో ప్రారంభం కానున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా బోర్ల కిందే ఆధారపడి పంటలు సాగుచేసే రైతులు ఉన్నారు. యాసంగి పంటల సమయంలో కరెంటు కోతలు విధించడంతో వరికి రైతులు కావాల్సిన సమయాల్లో నీళ్లు అందించలేక పోయారు. దీని ప్రభావం ధాన్యం దిగుబడిపై పడే అవకాశముంది.

కౌశల్ కేంద్రంలో కాసుల కక్కుర్తి

- అడ్డదారులు తొక్కుతున్న ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం నిర్వాహకులు
- నకిలీ వేలి ముద్రలతో వందశాతం హాజరు చూపిస్తూ లక్షలు స్వాహా
- సిబ్బంది లేరు.. తరగతులు జరగవు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం (పీఎంకేకే) నిర్వాహకులు కాసుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పేరిట డిగ్రీ, ఇంటర్, పదో తరగతి విద్యార్థులను చేర్చుకొని, ఆపై వారికి ఎలాంటివీ నేర్పించడం లేదని తెలుస్తున్నది. సరైన సిబ్బంది లేకపోవడంతో కేవలం కంప్యూటర్ టైపింగ్ మాత్రమే నేర్పిస్తూ.. కాలం వెళ్లదీస్తున్నారని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. అడ్మిషన్ తీసుకున్న ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం వేలాది రూపాయలు చెల్లిస్తున్నది. దీన్ని ఆసరాగా చేసుకొని నిర్వాహకులు జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 మండలాల నుంచి 200 మందిని చేర్చుకున్నారు. అడ్మిషన్ అయిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇస్తామని, ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దీనిని నమ్మి చేరిన విద్యార్థులకు ఎలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహించడం లేదు. క్లాస్‌ల ప్రారంభానికి ఇంకా సమయం ఉందని, అప్పటి వరకు టైపింగ్ నేర్చుకోవాలంటూ దాట వేస్తున్నారని, కేవలం ఎనిమిది కంప్యూటర్లే ఉన్నాయని పలువురు విద్యార్థులు తెలిపారు.

నకిలీ వేలి ముద్రలతో..

కౌశల్ కేంద్రంలో అడ్మిషన్ అయిన విద్యార్థులకు స్టైఫండ్ వస్తుంది. అలాగే నిర్వాహకులకు నిర్వహణ డబ్బులు రావాలంటే బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి. కనీసం 80 శాతం హాజరు ఉంటేనే డబ్బులు వస్తాయి. ప్రస్తుతం ఇక్కడ 200 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోగా, ఇందులో కేవలం 50 నుంచి 80 మంది విద్యార్థులు మాత్రమే వచ్చి వేలి ముద్రలు వేసి వెళ్తున్నారు. అయితే, 100 శాతం వస్తున్నట్లు నకిలీ వేలి ముద్రలతో బయోమెట్రిక్ హాజరు సృష్టిస్తున్నారు. ప్రతి రోజూ విద్యార్థులు రాగానే, వారి వేలి ముద్రలు తీసుకొని ఉదయం, సాయంత్రం హాజరు వేస్తుంటారు.

జిల్లా కేంద్రంలోని పీఎంకేకే కేంద్రం

నకిలీ వేలి ముద్రలు వేస్తున్న విద్యార్థినులు

శుక్రవారం ఉదయం 10 గంటలకు 'నమస్తే తెలంగాణ' కేంద్రానికి వెళ్లగా ఇద్దరు విద్యార్థులు నకిలీ వేలిముద్రలు వేస్తూ కనబడ్డారు.

సిబ్బంది లేకున్నా.. ఉన్నట్లు..

పీఎంకేకేలో ప్రోగ్రామ్‌లను నేర్పించడానికి 13 నుంచి 15 మంది ఉపాధ్యాయులు అవసరముండగా, కేవలం ఒకరిద్దరితో వెళ్లదీస్తున్నా రు. పూర్తిస్థాయి సిబ్బంది ఉందని రికార్డులు సృష్టించి ప్రతి నెలా లక్షల్లో దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. కేంద్రానికి సంబంధించి పూర్తి వివరాలివ్వాలని నిర్వాహకులను కోరగా, ప్రస్తుతం రిక్రూట్‌మెంట్ జరుగుతుందని, ఇప్పుడే వివరాలు ఇవ్వలేమని దాట వేశారు. పీఎంకేకేలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండగా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది.